క్లుప్తంగా

ఎరుకుమాంబ సన్నిధిలో అన్న సమారాధన


భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ లీలావతి, ఈవో రమాబాయి

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో మహా శివరాత్రి మహోత్సవం ముగింపు సందర్భంగా శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి ఆలయం ఆవరణలో ఈవో రమాబాయి ఆధ్వర్యంలో మారువారం సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. కార్పొరేటర్ ఆళ్ల లీలావతి పాల్గొని భక్తులకు వడ్డన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయం సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



దాబాగార్డెన్స్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ సిటీ మహిళా ప్రెసిడెంట్‌గా నియమితులైన కృపాజ్యోతి శనివారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ పరిశీలకుడు వీసం రామకృష్ణ, కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ట్రస్టీ మళ్ల ధనలత, స్టేట్ డైరెక్టర్ నీలాపు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న ముజీబ్‌ఖాన్

దాబాగార్డెన్స్: శనివారం స్వామి వివేకానంద ఆశ్రమంలో ఉన్న వారికి, పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సంఘ సేవకుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దక్షిణ నియోజకవర్గ ముస్లిం మైనార్టీ నాయకుడు ముజీబ్‌ఖాన్ కుమారుడు మహ్మద్ అతిక్ ఖాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమం జరిగింది. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల పట్ల గౌరవభావం పెంపొందాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకురాలు కృష్ణకుమారి

దాబాగార్డెన్స్: భద్రతపై జాగ్రత్త వహించాలని ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు పేర్కొన్నారు. 'సేఫ్ స్పేస్ ఫర్ వుమెన్ టు ఆల్ ది ఇంటర్మీడియట్ గరల్స్' అనే అంశంపై శనివారం కళాశాల ఉమెన్ వింగ్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బాలికల రక్షణకు ఎన్నో చట్టాలున్నాయని, వాటిపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు భద్రత కోసం స్వతహాగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమాజ ప్రగతికి మహిళ మూలాధారమని, మహిళల పట్ల సమాజంలో అన్ని వర్గాల్లో గౌరవం పెంపొందించేందుకు కృషి అవసరమన్నారు. అనంతరం పలువురు అధ్యాపకులు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఉమెన్ వింగ్ ప్రతినిధులు స్వరాజ్యలక్ష్మి, కృష్ణకుమారి, మల్లిక, ఇందిర, కళాశాల ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజని తదితరులు పాల్గొన్నారు.

బస్టాపులే అంగళ్లు

- పూర్ణామార్కెట్ జంక్షన్‌లో వింత ధోరణి
- ఎండలోనే ప్రయాణికుల పడిగాపులు


బస్ షెల్టర్‌లో దుకాణం.. అడ్డంగా బైక్‌లు, ఆటో


ఎండలో నిలబడిన ప్రయాణికులు


బస్ షెల్టర్ ఎదురుగా సర్వీస్ ఆటోలు

జగదాంబ: పూర్ణామార్కెట్ జంక్షన్ వద్ద బస్టాపులు దుకాణాలుగా మారిపోయాయి. బస్టాపుల్లో బస్సులు నిలిచేందుకు వీలు లేకుండా ఆటోవాలాలు టిక్కెట్ సర్వీసుల కోసం ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. నగరంలో కీలక వాణిజ్య ప్రాంతం అయిన పూర్ణామార్కెట్‌కు నిత్యం జనసంచారం ఉంటుంది. నగరంలోనే కాకుండా పక్క జిల్లాలైన విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల నుంచి కూడా ప్రతి రోజు మార్కెట్‌కు వివిధ పనుల నిమిత్తం ఎంతో మంది వస్తుంటారు. అయితే ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్లు ప్రజలకు ఉపయోగపడటం లేదని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యయ ప్రయాసలతో మార్కెట్‌కు వచ్చే ప్రయాణికులు తిరుగు ప్రయాణంలో కనీసం బస్టాపుల్లో నిలబడడానికి కూడా వీల్లేకుండా కొందరు వ్యాపారులు బస్టాపులను ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారని చెబుతున్నారు. దీంతో తాము ఎండలో నిలబడి బస్సులు ఎక్కుతున్నామంటున్నారు. ఆర్టీసీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

బస్సు ఎక్కేందుకు చోటివ్వరు..

బస్టాండ్‌లో నిలబడే చోటు ఎలాగూ ఇవ్వడంలేదు. కనీసం బస్సు ఎక్కడానికి కూడా వీల్లేకుండా దారికి అడ్డంగా ఆటోలు పెడుతున్నారని పలువురు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉండే ఈ ప్రాంతం నిత్యం ఆటోలతో రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతానికి వన్ టౌన్‌తో పాటు పలు ప్రాంతాల నుండి బస్సులు వస్తుంటాయి. అయితే ఆ బస్సులు ఎక్కేందుకు వీల్లేకుండా ఆటోలు అడ్డంగా నిలిపి ఉంచడం వల్ల బస్సులు ఎక్కే తొందరలో ఒక్కోసారి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి బస్ షెల్టర్లలో దుకాణాలు, బస్టాపుల్లో ఆటోలను తొలగించి ప్రయాణికులు సురక్షిత ప్రయాణం చేసేందుకు సహకరించాలని కోరుతున్నారు.

పోర్టు ఆసుపత్రి, బెర్త్‌ల ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి


సీహార్స్ జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: పోర్టు ఆసుపత్రి, బెర్త్‌ల ప్రైవేటీకరణ నిలుపుదల చేస్తూ షిప్పింగ్ సెక్రటరీ ప్రకటన చేయాలంటూ యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం పోర్టు ప్రధాన ద్వారం (సీహార్స్ జంక్షన్) వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధి వీఎస్ పద్మనాభరాజు మాట్లాడుతూ షిప్పింగ్ సెక్రటరీ పోర్టు ఆస్తులు, బెర్త్‌లు, హాస్పిటల్, పోర్టు కళావాణి ఆడిటోరియం, కల్యాణ మండపం టెండర్లు వేసినా, ఎవరూ రాకపోవడంతో ఎలాగైనా పోర్టు ఆస్తులు ప్రైవేటీకరించాలని సర్వే చేయడానికి విశాఖ పర్యటనకు వచ్చినట్టుందని ఆరోపించారు. బి. జగన్, లక్ష్మణరావు, రామలింగేశ్వరరావు, జక్కన్న, సత్యనారాయణ, ఎల్లారావు, నర్సింగరావు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

విశాఖ పోర్టులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సుదాంష్‌పంత్‌కి విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బీసీహెచ్ మసేన్ విజ్ఞప్తి చేశారు.

పోర్ట్ పెన్షనర్ల ధర్నా రేపు

మద్రిపాలెం: పోర్టు ట్రస్ట్‌పై కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ చైర్మన్ సనపల బంగారురాజు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావుతో కలిసి ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం మురళీనగర్, తెన్నేటినగర్, మాధవధార, కళింగనగర్ తదితర ప్రాంతాల్లో కరపత్రాలు అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి పి.ఎస్.ప్రకాష్‌రావు, కోశాధికారి అన్నపు నారాయణరావు, కె.గణేష్, పి.రామారావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

అల్లిపురం : దేశంలో ప్రధాన ఓడరేవుల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డీకే శర్మ కేంద్ర షిప్పింగ్ కార్యదర్శి సుదాంష్ పంత్‌ను శనివారం కలసి వినతిపత్రం అందజేశారు. అన్ని పోర్టులతో పాటు విశాఖ పోర్టులోను బోర్డు మెంబర్ల నియామకం జరగలేదని, తక్షణమే బోర్డు మెంబర్ల నియామకం చేపట్టాలని కోరారు.

అన్నదాన సత్రం తనిఖీ


భక్తులతో కలిసి భోజనం చేస్తున్న కొల్లి సింహాచలం

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం శనివారం అన్నదాన సత్రాన్ని తనిఖీ చేశారు. భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు. ఆహార నాణ్యతను పరిశీలించారు.

నగర సుందరీకరణకు ప్రాధాన్యం

- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు


సుందరీకరణ పనులపై అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ రాజాబాబు

దాబాగార్డెన్స్: వచ్చే నెలలో జరగనున్న రెండు అంతర్జాతీయ సదస్సుల నేపథ్యంలో నగరంలో చేపడుతున్న సుందరీకరణ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ పి. రాజాబాబు పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం ఎన్ఏడీ జంక్షన్ నుంచి మురళీనగర్, తాటిచెట్లపాలెం జంక్షన్ జాతీయ రహదారి వరకు అధికారులతో కలిసి పర్యటించారు. రహదారికి అనుకుని ఉన్న ప్రాంతాలు తెలిపే సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రహదారికిరువైపులా పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించాలని, చెట్లు, ఎలక్ట్రికల్ పోల్స్, గోడలకు ఉన్న ప్రకటన బోర్డులు, కేబులు వైర్లు, పోస్టర్లు తొలగించి శుభ్రం చేయించాలని అధికారులకు సూచించామన్నారు. జీ–20 సదస్సుకు 20 దేశాల ప్రతినిధులు రానున్న నేపథ్యంలో పారిశుధ్య కార్మికులను ఆయా ప్రాంతాల్లో ఉంచి, రోడ్డును నిరంతరం శుభ్రంగా ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు, పట్టణ ప్రణాళికాధికారి బి. సురేష్ కుమార్, హార్టీకల్చర్ డీడీ దామోదరరావు, జోనల్ కమిషనర్లు మల్లయ్య నాయుడు, ఆర్‌జీవీ కృష్ణ, పర్యవేక్షక ఇంజనీర్లు వేణుగోపాలరావు, రామ్మోహనరావు, డీసీపీ సంజయ్, ఏసీపీ, ఏఎంఓహెచ్ తదితరులు పాల్గొన్నారు.

యువతికి ఆశ్రయం



యువతిని వసతి గృహానికి తరలించిన వాసు తదితరులు

అల్లిపురం: మాటలు రాని యువతి ఒకరు గత 20 రోజులుగా స్టీల్ ప్లాంట్ దరి మదీనాబాగ్ వద్ద రోడ్డుపై ఇబ్బంది పడుతోంది. విషయం గమనించిన స్థానికులు ఆమెకు ఆశ్రయం కల్పించారు. అనంతరం వారు ఏయూటీడీ, టీఎస్ఆర్ మహిళా వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయికి, ఏయూటీడీ ప్రతినిధి పి.వాసుకు సమాచారం అందజేశారు. దీంతో ఆమెకు అక్కడి నుంచి కూర్మన్నపాలెం పోలీసుల సహకారంతో ఏయూటీడీ మహిళా వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు.

ఇగ్నో ప్రవేశాలకు 28వ తేదీ తుది గడువు

ఎంవీపీకాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2023 జనవరి విద్యాసంవత్సరానికిగాను ప్రవేశాల గడువు ఈ నెల 28తో ముగియనుంది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు వివరాలు వెల్లడించారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రవేశాల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తి ఫీజు రాయితీ కల్పిస్తున్నారు. పూర్తి వివరాలకు ఎంవీపీకాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలి.

27 నుంచి యోగా శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి జనరల్ యోగా తరగతులను ప్రారంభిస్తున్నట్లు కేంద్రం విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తరగతులు జరుగుతాయని, ఆసక్తి ఉన్న వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మార్చి 1 నుంచి స్థూలకాయ నివారణ శిబిరం

ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్ర ఆధ్వర్యంలో మార్చి 1 నుంచి స్థూలకాయ నివారణ ప్రత్యేక యోగా శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు భాను కుమార్ తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు 83743 57324లో సంప్రదించాలని సూచించారు.

గర్భిణులు, చిన్నారులకు వ్యాక్సినేషన్

అల్లిపురం: గర్భిణులు, చిన్నారులకు శనివారం 33వ వార్డు వుడ్‌యార్డ్ సచివాలయంలో వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం తులసి, ఆశ వర్కర్లు పార్వతి, వరలక్ష్మి పాల్గొని గర్భిణులు, బాలింతలకు మెరుగైన ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. 6 నెలల నుంచి 16 సంవత్సరాల పిల్లలకు అన్ని రకాల టీకాలు, 'ఎ' విటమిన్ సిరప్, చిన్నారులకు కోరింత దగ్గు, పోలియో టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల శ్రీహరిరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంకన్నకు విశేష పూజలు

కంచరపాలెం: స్థానిక తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫాల్గుణ మాసం శుద్ధ షష్టి శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథ శర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వర స్వామి, పద్మావతి, అలివేలు మంగమ్మకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన చేశారు. ఆలయం రద్దీగా ఉండడంతో ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు.

వివేకానంద బోధనలపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న స్వామి దివ్య ప్రబోధానంద

దాబాగార్డెన్స్: వివేకానంద అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రేమసమాజం విద్యార్థులకు వివేకానంద బోధనలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్వామి దివ్య ప్రబోధానంద కార్యక్రమంలో పాల్గొని విద్యార్థినులకు స్వామి వివేకానంద బోధనలను విద్యార్థులు ఎలా ఆకళింపు చేసుకోవాలనే అంశంపై చక్కటి ప్రసంగం చేశారు. ఇప్పటి తరం స్కూళ్లలో మహనీయుల జీవిత చరిత్రలు, వారు ప్రబోధించే బోధనలు చెప్పడం లేదని, ఒక్క చదువు విషయంపైనే జాగ్రత్తలు తీసుకుంటూ మిగతా విషయాలు విస్మరిస్తున్నారన్నారు. సీనియర్ న్యాయవాదులు విద్యాశంకర ఖండిల్వాల, కుప్పిలి మురళీధర్, బగాది తులసీదాస్, సుధీర్, పైడి గోవిందరావు, ద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గృహసారథి కుటుంబానికి బీమా సాయం


ఎల్మాజీకి వైఎస్సార్ బీమా సాయం అందజేస్తున్న తోట పద్మావతి

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు కొబ్బరితోట–1 సచివాలయం గృహసారథిగా నియమితులైన పిట్ల కుంచేశ్వరరావు అలియాస్ కుంచి ఈ నెల 20వ తేదీన అకస్మాత్తుగా మృతి చెందారు. దీంతో విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, నాయకులు లింగం శ్రీనివాసరావు, లండా రమణ శనివారం వారికి ఇంటికి వెళ్లి అతని భార్య ఎల్మాజీని పరామర్శించారు. అనంతరం ఆమెకు వార్డు వలంటీర్ జ్యోతి, కార్యదర్శులు వాసు, సంతోష్, గౌష్ సహకారంతో వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో అంబటి వెంకటరావు, నర్సింగరావు, సత్తిరాజు, దుర్గారావు, అంబటి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అరుదైన చికిత్సతో ప్రాణరక్షణ



మాట్లాడుతున్న అను ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీలలిత

మహారాణిపేట : గుండెకు సంబంధించిన అరుదైన చికిత్సను అను ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూరో అండ్ కార్డియాక్ సైన్సెస్ వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. శనివారం మీడియా సమావేశంలో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ నర్సీపట్నానికి చెందిన పెట్ల అప్పలనాయుడు (65) బృహద్ధమని కవాటం (వాల్వ్) పూడుకుపోవడంతో అను వైద్యులు వాల్వ్ మార్పిడి ఆపరేషన్ నిర్వహించి, ప్రాణాపాయం నుంచి రక్షించారని అన్నారు. శస్త్ర చికిత్స లేకుండానే పూడుకుపోయిన వాల్వ్ స్థానంలో తొడ ధమని ద్వారా కొత్త వాల్వ్‌ను అమర్చి ఈ సమస్యను పరిష్కరించవచ్చని తెలిపారు. అత్యాధునిక క్యాథలాబ్‌లో ఏ విధమైన కోత లేకుండా ఈ చికిత్సను పూర్తి చేసి, రోగిని రెండు మూడు రోజుల్లోనే ఆస్పత్రి నుంచి ఇంటికి పంపించవచ్చన్నారు. ఈ అరుదైన చికిత్సను విజయవంతంగా నిర్వహించిన కార్డియాలజిస్టులు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ పాల్ కిరణ్, డాక్టర్ శివదయాల్, డాక్టర్ సంతోష్‌కుమార్‌లను చైర్మన్ డాక్టర్ జి.రమేష్ అభినందించారు. అను ఇనిస్టిట్యూట్ డైరెక్టర్, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ శ్రీలలిత, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎంజీవీ ఆదిత్య పాల్గొన్నారు.

వృద్ధి అజెండాలో భారత్ ప్రగతి



గ్రోత్ ఇంజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సదస్సులో మాట్లాడుతున్న ప్రతినిధులు

ఆరిలోవ : వృద్ధి అజెండాలో భారతదేశం అగ్రగామిగా నిలవడానికి సిద్ధంగా ఉందని హైదరాబాద్‌కు చెందిన ఈ అండ్ వై మేనేజింగ్ పార్టనర్ జయేష్ సంఘ్వీ తెలిపారు. నగరంలో ఓ హోటల్‌లో శనివారం జరిగిన గ్రోత్ ఇంజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సీఐఐ విశాఖపట్నం జోన్ వార్షిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రపంచీకరణ, అవకాశాలలో అభివృద్ధి చెందుతున్న ధోరణలు అనే అంశంపై మాట్లాడారు. డిజిటలైజేషన్ ఎకో సిస్టంను అందించిందన్నారు. దీంతో పాటు ఫార్మలైజేషన్ గవర్నెన్స్ సమస్యను పరిష్కరిస్తూ కొత్త వ్యాపార ఉత్పత్తుల సేవలను పెంపొందించిందన్నారు. దీనివల్ల సమర్థత, పోటీతత్వం పెరుగుతాయన్నారు. ఇది దేశంలో పెట్టుబడులను పెంపొందించడానికి సహాయపడుతుందన్నారు. ఉత్పత్తులు తయారీ, మౌలిక సదుపాయాల కల్పనలో భారతదేశం ముందుందన్నారు. ఇన్ఫోసిస్ లిమిటెడ్ డెలివరీ హెడ్ నర్రా సురేష్ మాట్లాడుతూ ఐటీ ల్యాండ్ స్కేప్‌లో సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ప్రాబ్లం సాల్వర్ నుంచి ప్రాబ్లం ఐడింటిఫియర్ వరకు లోపం ఎక్కడ ఉందో అంచనా వేయలేకపోతున్నామన్నారు. ఇది పెద్ద సవాల్‌గా మారిందన్నారు.

సీఐఐ విశాఖ జోన్‌కు కొత్త ఆఫీస్ బేరర్లు..

కాన్ఫెరెన్స్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) విశాఖ జోన్‌కు కొత్త ఆఫీస్ బేరర్లను ఈ సమావేశంలో నియమించారు. సీఐఐ 2023–24 నూతన చైర్మన్‌గా విశాఖ ఫ్మాసిటీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈవో డాక్టర్ పి.పి. లాల్‌ను నియమించారు. వైస్ చైర్మన్‌గా ఇంటిగ్రిల్ ట్రేడింగ్ అండ్ లాజిస్టిక్ మేనేజింగ్ పార్టనర్ గ్రంధి రాజేష్‌తో పాటు మరికొందరు సభ్యులను నియమించారు.

వైద్య విద్యలో ఏఎంసీ విద్యార్థుల ప్రతిభ


డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులైన ఎంబీబీఎస్ విద్యార్థుల జాబితాను విడుదల చేసింది. వీరిని శనివారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ (అడ్మిన్) జి.రాజేంద్రప్రసాద్ అభినందించారు. ఏపీలోని మొత్తం 28 మెడికల్ కాలేజీల నుంచి 119 మంది విద్యార్థుల్లో ఆంధ్రా మెడికల్ కాలేజీకి చెందిన పది మంది విద్యార్థులు డిస్టింక్షన్ సర్టిఫికెట్లు అందుకున్నారు.

ఎంబీబీఎస్ అన్ని విభాగాల్లో బి.నందన్ 1925 మార్కులతో అత్యున్నత స్థానంలో నిలిచారు. ఫైనల్ ఎంబీబీఎస్‌లో ఎస్.సాయిమౌనిక 707 మార్కులతో అత్యధిక మార్కులు సాధించారు. డి.ఆశాశ్రీ, జి.లోకిత, కె.షారన్ చక్రవర్తి, పి.లిఖిత, పి.మధురిమ, పి.తేజ, శ్యామల, సయ్యద్, తహసిన్, యు.సత్య వెంకట రాధ డిస్టింక్షన్ పొందారు.

యూజర్ చార్జీలు చెల్లించాలి


యూజర్ చార్జీల వసూలుపై సూచనలు ఇస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: యూజర్ చార్జీలు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్ అన్నారు. శనివారం ఆయన జోన్ పరిధిలో పూర్ణామార్కెట్, టౌన్‌కొత్తరోడ్డు, వెలంపేటతో పాటు 12 వార్డుల్లో పర్యటించి సెక్రటరీలతో కలిసి యూజర్ చార్జీలు వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్‌లో అందరు సెక్రటరీలు పబ్లిక్ హెల్త్ ఇన్‌స్పెక్టర్లు యూజర్ చార్జీలు వసూలు చేసి జోన్‌ను ముందు వరసలో నిలపాలన్నారు. మురికివాడల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు, దుకాణ సముదాయాలు, హోటళ్లు, ఆస్పత్రుల నుండి యూజర్ చార్జీలు ఎప్పటికప్పుడు వసూలు చేయాలన్నారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేని చదువులు నేర్పాలి


జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కంచరపాలెం: చిన్నారులకు ఒత్తిడి లేని చదువులు నేర్పించాలని, కేవలం మార్కులు, ర్యాంకుల కోసమే కొన్ని పాఠశాలలు పిల్లలను ఒత్తిడికి గురి చేస్తున్నాయని విశాఖ అగ్రపీఠాధిపతులు ఆర్చిబిషప్ మల్లవరపు ప్రకాష్ అన్నారు. జ్ఞానాపురం ఏకేఎం జూబ్లీ (జెమ్స్) ఇంగ్లీష్ మీడియం పాఠశాల 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 'మై ఇండియా మై ప్రైడ్'ను శనివారం సాయంత్రం నిర్వహించారు. భావితరాలకు పునాదులు పాఠశాల దశలోనే పడతాయన్నారు. ముందుగా ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు. చిన్నారుల వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ పి.రత్నకుమార్, రెవరెండ్ ఫాదర్ కేపీఎం థెరెసా, ఫాదర్ జె.జాన్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ డి.ప్రశాంతి, సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సహకారం ప్రశంసనీయం


సీపీ సీహెచ్ శ్రీకాంత్‌కు జ్ఞాపిక అందజేస్తున్న గంట్ల శ్రీనుబాబు

దొండపర్తి : సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవాల విజయవంతానికి పోలీసు అధికారులు అందించిన సహకారం, సేవలు ప్రశంసనీయమని అప్పన్న ధర్మకర్తల మండలి సభ్యుడు, వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు కొనియాడారు. శనివారం నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సింహాద్రినాథుడి జ్ఞాపికను అందజేశారు. గత ఏడాది దేవస్థానం ఆధ్వర్యంలో జరిగిన వైకుంఠ ఏకాదశి, కల్యాణ మహోత్సవం, చందనోత్సవం, గిరిప్రదక్షిణ ఉత్సవాల విజయవంతానికి జిల్లా యంత్రాంగంతో పాటు పోలీస్ శాఖ విశేష కృషి చేసిందని సీపీకి శ్రీనుబాబు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ ఏడాది కూడా ఏప్రిల్ 1న జరగనున్న అప్పన్న కల్యాణోత్సవం, 23న స్వామి నిజరూపదర్శనం (చందనోత్సవం) ఉత్సవాలకు సహకారం అందించాలని, ప్రజలకు సులభంగా స్వామి దర్శనం కల్పించే విధంగా చూడాలని సీపీ శ్రీకాంత్‌ను కోరారు.

మహిళా పోలీస్ అడ్‌హక్ కమిటీ అధ్యక్షురాలికి సత్కారం


నూర్జహాన్ బేగంను సత్కరిస్తున్న ఉద్యోగ సంఘం ప్రతినిధులు

అల్లిపురం: ఏపీ గ్రామ వార్డు సచివాలయ మహిళా పోలీస్ సంక్షేమ సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ అధ్యక్షురాలిగా నియమితురాలైన ఎండీ నూర్జహాన్ బేగంకు 33వ వార్డు సచివాలయాల సిబ్బంది, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూర్జహాన్ బేగం మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నెరువేరుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పీవీ కిరణ్‌కుమార్, భార్గవ్ సూతేజ్, నారాయణరావు, రమేష్, రాము, రేణుక, త్రివేణి, చిరంజీవి, రియాజ్, తులసిరాము, శ్రావ్యలక్ష్మి పాల్గొన్నారు.